క్లుప్తంగా

వరాహ నదికి జలకళ


వరాహనదిలోకి చేరుతున్న వర్షం నీరు

కోటవురట్ల: వరాహ నదికి జలకళ వచ్చింది. చాలా కాలంగా ఎండిపోయి చుక్కనీరు లేకుండా ఉన్న వరాహ నదిలోకి ప్రస్తుత వర్షాలతో నీరు చేరుతోంది. ఎగువ ఏజెన్సీ ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరాహ నదిలోకి వరద నీరు చేరుతోంది. పాత రోడ్డు సమీపంలో వరాహ నదిలోకి సర్పా నది కూడా కలవడంతో ప్రవాహం పెరుగుతోంది. రెండు నదుల సంగమంతో పందూరు వద్ద ప్రవాహం రానురాను పెరుగుతోంది.

విద్యార్థులకు సైకిల్ పోటీలు


సైకిల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

నక్కపల్లి: వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. గత 20 రోజుల నుంచి గ్రంథాలయంలో పుస్తక పఠనం, పద్య పఠనం, వ్యాసరచన, చిత్ర లేఖనం, నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లిష్, వంటి పోటీలు చేపట్టారు. ఆట పాటల్లో భాగంగా సైక్లింగ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయాధికారి జనార్దన్ తెలిపారు. ఆయా పోటీల్లో విజేతలకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అచ్యుతాపురం రూరల్ : మండలంలో పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, దిబ్బపాలెం, భోగాపురం రోడ్, అచ్యుతాపురం, మోసయ్యపేట బర్మా కాలనీ, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, వెంకటాపురం కూడలి, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వర్షాలకు అధ్వానంగా రోడ్లు


బురదమయంగా మారిన పోలవరం కాలువ అప్రోచ్ రోడ్డు

ఎస్.రాయవరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దార్లపూడి శివారు పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్డు వద్ద డైవర్షన్ సక్రమంగా వేయకపోవడంతో కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. రద్దీగా ఉండే ఈ రోడ్డు క్రాసింగ్ పనులు చేసేటప్పుడు కాంట్రాక్టర్ నిర్వాకం వల్ల ద్విచక్ర వాహనాదారులు అవస్థలు పడ్డారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

థియేటర్లలో తహసీల్దార్ సోదాలు


పాయకరావుపేటలో థియేటర్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పాయకరావుపేట: పట్టణంలోని మూడు సినిమా థియేటర్లలో తహసీల్దార్ గారా ఆనందరావు సోదాలు చేశారు. గౌతమ్, రామకృష్ణ చిత్రమందిర్, శ్రీలక్ష్మి (ఎస్‌వీఎస్) థియేటర్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి థియేటర్లు నిర్వహిస్తున్నారా? లేదా? అనే విషయాలపై తనిఖీ చేశామన్నారు. టికెట్ ధరలు, క్యాంటీన్లు, భద్రత చర్యలు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించినట్లు చెప్పారు. మూడు థియేటర్లు సక్రమంగానే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: మునగపాక మెయిన్‌రోడ్డులో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. హెచ్‌సీ ధనరాజ్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడంతో పాటు బైక్‌కు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్‌సీ హెచ్చరించారు.

కియోస్క్ సేవలకు మంగళం..!


సోమలింగపాలెం సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్

- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా యంత్రాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- సరైన సమాచారం అందక రైతులకు తప్పని అవస్థలు

యలమంచిలి రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను రద్దు చేయగా, మరికొన్నింటి పేర్లు మార్చి అరకొరగా అమలు చేస్తోంది. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలను సైతం కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం రైతులు ఊరు దాటకుండా అన్ని రకాల సేవలను అందించేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, దాణా, పంటలకు మార్కెటింగ్ సౌకర్యం వంటి అన్ని రకాల సేవలను పొందే అవకాశం కల్పించింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సేవా సేవా కేంద్రాల్లో(గతంలో రైతు భరోసా కేంద్రాలు) కియోస్క్ యంత్రాలు మూలకు చేరాయి. కొన్ని చోట్ల వీటిని ఉపయోగించకపోవడం, మరికొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు, ఇంకొన్ని చోట్ల విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

దిష్టిబొమ్మల్లా యంత్రాలు

యలమంచిలి మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 12 రైతు భరోసా కేంద్రాలకు కియోస్క్ యంత్రాలను అందజేశారు. యలమంచిలి పట్టణంలో ఉన్న రెండు చోట్ల కొంత మేర వీటిని అరకొరగా వినియోగిస్తున్నా.. మిగిలిన చోట్ల ఈ యంత్రాలన్నీ మూలకు చేరి దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. పులపర్తి, పురుషోత్తపురం, సోమలింగపాలెం గ్రామాల్లో సచివాలయాల్లోనే కియోస్క్ యంత్రాలు ఉండిపోయాయి. పోతురెడ్డిపాలెంలో విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉంది. మండలంలో దాదాపుగా కియోస్క్ యంత్రాల వినియోగం లేదనే చెప్పాలి. వీటి బదులుగా వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు మొబైల్ యాప్‌తోనే ఆ శాఖకు సంబంధించిన అన్ని పనులను చేపడుతున్నారు. కియోస్క్ యంత్రాలకు సంబంధించి ప్రభుత్వ సర్వర్లు మొరాయించడం, గత ప్రభుత్వంలో వీటి నిర్వహణ, ఇతర సమస్యలను పరిష్కరించే సాఫ్ట్‌వేర్ సంస్థ బృందం ప్రస్తుతం స్పందించకపోవడం, ఇతర సాంకేతిక సమస్యలతో కియోస్క్ యంత్రాల సేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతగానో ఉపయోగపడిన కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తెచ్చి రైతులకు ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన కియోస్క్ యంత్రాలు మూలకు చేరకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సేవలు కొనసాగించాలి



కియోస్క్ యంత్రాలతో రైతులకు సేవలు కొనసాగేలా చూడాలి. చదువు లేని రైతులకు కూడా ఈ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. రైతులకు అవసరమైన సేవలన్నీ వీటి ద్వారా అందే వీలుంది. అందుకే రైతు సేవా కేంద్రాలను ఆధునికీకరించి కియోస్క్ యంత్రాల సేవలు యథాతథంగా అందేలా చూడాలి.

– రాపేటి శ్రీనివాసరావు, రైతు, కొత్తపాలెం

సాంకేతిక సమస్యలు ఉన్నాయి

మండలంలో కొన్ని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు సాంకేతిక సమస్యలతో పని చేయలేదు. కొన్నింటికి విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నాయి. మిగిలిన కియోస్క్ యంత్రాల సేవలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లో యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలన్నీ అందిస్తున్నాం.

– పొలిమేర మోహన్‌రావు, వ్యవసాయాధికారి, యలమంచిలి మండలం

ఆత్మీయ అధినేతను కలిసిన మాజీ ఎమ్మెల్యే జోగులు


వైఎస్ జగన్‌తో మాజీ ఎమ్మెల్యే జోగులు, సందీప్

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు కలిశారు. తాడేపల్లి నివాసంలో జగన్‌ను కలిసి నియోజకవర్గంలో సమస్యలు, పార్టీ పరిస్థితిపై చర్చించినట్లు జోగులు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రజా సమస్యలాపై పోరాటం చేయాలని తమ అధినేత సూచించారన్నారు. ఆయన వెంట పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కంబాల సందీప్ ఉన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం


పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న రైతులు

మునగపాక: సీజన్‌లో పశువుల పెంపకం పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ కోరారు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున పశువులకు రోగాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం పలువురు రైతులు డాక్టర్ ప్రదీప్‌కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు టీకాలను క్రమం తప్పకుండా వేయించాలన్నారు. అజోల్లా తయారీపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మళ్ల మల్లినాయుడు, మళ్ల జోగినాయుడు, నరసింగరావు, అప్పలనాయుడు, సూరిబాబు, చిన్నారావు, సూరప్పారావు, బాలాజీ, తేజ, ఆదిబాబు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఉపాధి హామీ పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ఉపాధి హామీ పథకం పనులు మరింత పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తామన్న ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వాలని సూచించారు. పని వేళలు మరింత పెంచి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. పంట సంజీవిని(నీటి గుంటల)పై మరింత దృష్టి సారించాలన్నారు. ఈ సంజీవిని ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏపీవో శివ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాపై అవగాహన కల్పిస్తున్న యోగా గురువు మూర్తి


కోటవురట్లలో యోగా చేస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

పాయకరావుపేట: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా చేయడం ఎంతో ముఖ్యమని ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ అతిథి గృహం ఆవరణలో యోగా గురువు కె.ఎస్.ఎన్.మూర్తి యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ పద్మావతి, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెండో రోజు యోగా శిక్షణ

కోటవురట్ల: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండో రోజు బుధవారం యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. ప్రతి రోజు దినచర్యలో వాకింగ్, యోగా భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

చురుగ్గా వెంకన్న ఆలయ నిర్మాణ పనులు


మునగపాకలో నిర్మాణంలో ఉన్న వెంకన్న ఆలయం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఆలయ నిర్మాణంలో స్థానికులు రాజకీయాలకు అతీతంగా భాగస్వాములవుతున్నారు. విరివిగా విరాళాలు అందిస్తూ సహకారం అందిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఆలయ నిర్మాణం పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు.

పాడిరైతులకు పావలా వడ్డీకే రుణాలు


వెటర్నరీ ఏరియా ఆస్పత్రి ఏడీ డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం : పాడి రైతులకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు పశుసంవర్థకశాఖ నిర్ణయం తీసుకుందని నర్సీపట్నం వెటర్నరీ ఏరియా ఆస్పత్రి ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. రైతులకు లాభసాటిగా ఉన్న పాడిని అభివృద్ధి చేయడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఒక పశువు కలిగి ఉన్న రైతు మరో పశువును కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. మెప్మా, వెలుగు ద్వారా పావలా వడ్డీకి రుణాలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లోని 87 మంది రైతులను గుర్తించామని, వీరందరికీ త్వరలోనే పావలా వడ్డీ రుణాలు అందజేస్తామన్నారు. వడ్డీ భారం లేనందున పాడిని అభివృద్ధి చేసుకుని తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం ద్వారా మరలా తిరిగి రుణం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

క్లస్టర్ విధానంపై పునరాలోచించాలి


దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేస్తున్న దేవరాపల్లి మండల వీఆర్‌వోలు

దేవరాపల్లి : గ్రామ రెవెన్యూ అధికారులను క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు ఒక వీఆర్‌వోను నియమిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 4పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని దేవరాపల్లి మండల వీఆర్‌వోల యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి మండల వీఆర్‌వోల యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. క్లస్టర్ విధానంతో మరింత పని ఒత్తిడిలోనై తీవ్ర అనారోగాల బారిన పడే ప్రమాదం ఉందని, గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన ఈ జీవో నుంచి వీఆర్‌వోలను మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వోల యూనియన్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ జగదీష్, కాసప్ప, దొర, రమణమ్మ పాల్గొన్నారు.

ఇనుప వ్యర్థాల బహిరంగ వేలానికి నిర్ణయం

మాడుగుల : స్థానిక మండల పరిషత్‌కు సంబంధించిన ఇనుప వ్యర్థాలు బహిరంగ వేలం వేయాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు ఆరు టన్నుల పాతబోరు విడిభాగాలు, ఇతర ఎనిమిది రకాల ఇనుప వ్యర్థాలను వేలం వేయాలని నిర్ణయించారు. పనికిరానిబోర్లు సామాన్లకు రేట్లు నిర్ణయించి వేలం వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, తహసీల్దారు రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రకాశ్, ఏఈ నాగమల్లేశ్వరి, ఎంపీపీ కార్యాలయం సీనియర్ సహాయకుడు డి.సురేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న పిడుగుపాటు బాధితుడు


ఆస్పత్రిలో గాయాలతో పశువుల కాపరి సూరిబాబు

నాతవరం : పిడుగుపాటుకు తీవ్ర గాయాలైన పశువుల కాపరి బొడ్డు సూరిబాబు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లింగంపేట పంచాయతీ శివారు బుచ్చెంపేట గ్రామానికి చెందిన సూరిబాబు మంగళవారం సాయంత్రం పిడుగు పాటుకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. శరీరం అంతా కాలిపోవడంతో గాయాలు తగ్గే వరకు ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందాలని వైద్యులు సూచించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

31న కేజేపురం కల్యాణ వేంకటేశ్వరునికి పెళ్లిరాట

6న స్వామి వారి కల్యాణోత్సవం


ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు గోడపత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 15 వ వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 31వ తేదీ పెళ్లిరాట కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించి గోడపత్రికను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు సారథ్యంలో విడుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా వచ్చే నెల 5వ తేదీన స్వామి వారి నిజరూపదర్శనం, 6వ తేదీ ఉదయం స్వామి వారి వార్షిక తిరుకల్యాణం జరుగుతుంది. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు.

జూన్ 6వ తేదీన భజన పోటీలు ఏర్పాటు చేసి నగదు బహుమతులు అందజేస్తారు. అలాగే ఆలయం వద్ద ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. 11వ తేదీన నాగవల్లి సంబరాలు, రాత్రికి పుష్పాంజలి సేవ, దర్పణ దర్శనం, పవలింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ జామి ర మణబాబు, ఆలయ కమిటీ సభ్యులు పుట్టా రాంబాబు, యల్లపు రాముతో పాటు శ్రీవారి సేవకులు, ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శనాచార్యులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో కాలువ గట్లు


ఆక్రమణకు గురువుతున్న భూమి కాలువ


ఆక్రమణలకు గురువుతున్న తాండవ నది ఒడ్డు, లింగాల కాలనీ రోడ్డు

పాయకరావుపేట: కాలువ గట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. తమ సొంత స్థలాల్లా భావించి పలువురు అక్కడ నిర్మాణాలు, పశువుల పాకలు, షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కాలువ గట్ల ఆక్రమణతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. పాయకరావుపేట పట్టణ పరిధిలోని తాండవ నది ఒడ్డున పలువురు అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. తాండవ చక్కెర కర్మాగారం నుంచి తాండవ నది పొడవునా నది గట్టు ఆక్రమణకు గురైంది. తాండవ నది ఒడ్డు ఉన్న నాగరాజుపేట మీదుగా రైల్వే గేటు ద్వారా లింగాల కాలనీ మీదుగా నర్సీపట్నం రోడ్డు సెంటర్‌కు వెళ్లే రోడ్డు మొత్తం కబ్జా పాలైంది. ఆర్అండ్‌బీకి సంబంధించిన ఈ రోడ్డు కొంత భాగం తుని పరిధిలో ఉండడం, మరి కొంత భాగం పాయకరావుపేట మండల పరిధిలో ఉండడంతో ఇరు పట్టణాలకు చెందిన అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పాయకరావుపేట పట్టణం నుంచి నిత్యం నర్సీపట్నం వెళ్లే ప్రయాణికులకు ఇదే దగ్గర మార్గం కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. తాండవ నది ఒడ్డును ఆక్రమించుకుని షెడ్లు, షాపులు, బడ్డీలు ఏర్పాటు చేయడంతో రోడ్డు కుచించుకుపోతోంది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతులకు పంట పొలాలకు సాగునీరు సరఫరా చేసే భూమి కాలువ కూడా ఆక్రమణలకు గురవుతోంది. తాండవ చక్కెర కర్మాగారం సమీపాన ఉన్న తాండవ నదిపై నిర్మించిన భూమి ఆనకట్ట నుంచి ఈ కాలువ ప్రారంభమై పొలాలకు సాగునీరు సరఫరా చేస్తుంది. పాయకరావుపేట, అరట్లకోట, నామవరం, గుంటపల్లి, ఉద్దండపురం తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. కానీ ఈ భూమి కాలువ గట్లు ఇరువైపులా ఆక్రమించుకుని పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాండవ నది గట్టు, భూమి కాలువ ఆక్రమణలకు గురవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు వాపోతున్నారు.

తెనాలి ఘటనలో పోలీసులను అరెస్ట్ చేయాలి

నర్సీపట్నం : తెనాలి ఘటనకు సంబంధించిన పోలీసులపై చట్టరీత్యా తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆరుగుల్ల రాజుబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత యువకులను విచక్షణరహితంగా కొట్టడం పోలీసులకు తగదన్నారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బతినేలా పోలీసులు వ్యవహరించారన్నారు. పోలీసు దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళిత, మైనార్టీ యువకులను చావగొట్టిన పోలీసు అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోంమంత్రి తక్షణమే కల్పించుకుని ఘటనకు బాధ్యులైన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పొంగిన గెడ్డలు..నిండిన చెరువులు


చీడిగుమ్మల వద్ద పొంగి ప్రవహిస్తున్న వరహానది

గొలుగొండ : రెండు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది మేలో ఇంతటి వర్షాలు ఎన్నడూ లేదని ప్రజలు చెబుతున్నారు. భారీ వర్షాలు కారణంగా బొడ్డేరు, పాలగెడ్డ, ధారగెడ్డ, వరహానది నుంచి భారీగా నీరు తాండవ జలాశయానికి చేరుతోంది. తీవ్ర స్థాయిలో ఎండలు ఉండాల్సిన సమయంలో భారీ వర్షాల కారణంగా ప్రజలు పూర్తిగా ఉపశమనం పొందారు. చెరువులు సైతం నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. దీని వల్ల ఈ ఏడాది ముందుగానే ఖరీఫ్ ప్రారంభం అవుతుంది. నారుమడులు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.